సమాచారం

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతు బజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 15, వంకాయ 18, బెండ 45, పచ్చి మిర్చి 45, కాకర 45, బీర 45, క్యాబేజీ 11, ఫ్రెంచిబీన్స్ 65, క్యారెట్ 15, దొండ 36, చిక్కుడు 65, గోకర 55, బీట్‌రూట్ 15, క్యాప్సికం 45, ఆలు 18, దోస 35, సొర 9, పొట్ల 15, ఉల్లి 14 చామ గడ్డ 55 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌గా జలేందర్‌రెడ్డి



హస్తినాపురం: వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌గా డి.జలేందర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎవరైనా వాటికి విఘాతం కలిస్తే కఠినంగా వ్యవహరిస్తానని ఆయన హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఒక వర్గాన్ని టార్గెట్ చేస్తూ రెచ్చ గొట్టేలా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, వదంతులను ఎవరూ నమ్మవద్దని ఇన్‌స్పెక్టర్ సూచించారు.

క్లుప్తంగా...

ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డికి కార్పొరేటర్ల అభినందన



మన్సూరాబాద్: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన ఏవీఎన్‌రెడ్డికి పలువురు కార్పొరేటర్లు అభినందనలు తెలిపారు. జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డిలు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రెస్టారెంట్ ప్రారంభం



మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ గడ్డిఅన్నారం క్రాస్ రోడ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన పిస్తాహౌజ్ రెస్టారెంట్‌ను శుక్రవారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, మూసారంబాగ్, సైదాబాద్ డివిజన్ల కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, కొత్తకాపు రవీందర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పిస్తా హౌజ్ ఫౌండర్ అబ్దుల్ మజీద్, నిర్వాహకులు త్రివిక్రమ్, నాయకులు గండి కృష్ణయాదవ్, లింగాల శ్రీనివాస్‌గౌడ్, సంఘిరెడ్డి, సుధీర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితే లక్ష్యసాధన సులువే



పరీక్షా సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

చంపాపేట: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితేనే గమ్యంతోపాటు ఉన్నత శిఖరాలను సులువుగా చేరుకోవచ్చని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నల్లా రఘుమారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన చంపాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివే 120 మంది విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్, పెన్నులు, జామెట్రీ బాక్సులను అందజేశారు. పాఠశాల హెచ్ఎం సత్తయ్య, ఉపాధ్యాయులు గుండు వెంకటేశ్వర్లు, నాయకులు గౌతంరెడ్డి, ముదుపు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివగంగ ఆలయంలో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీదేవి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ చేశారు. శివుడికి పూలతో అభిషేకం, పంచామృతాభిషేకంతో పాటు పలు పూజలు నిర్వహించారు. శుక్రవారం కావడంతో మహిళా భక్తులు అమ్మవారికి కుంకుమార్చన, దీపాలు వెలిగించి అమ్మవారు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్‌గౌడ్, ఆలయ డైరెక్టర్లు పాల్గొన్నారు.

‘టిమ్స్’తో సమస్యలు తలెత్తకుండా చూస్తా

- ప్రభాత్‌నగర్ కాలనీవాసులతో ఎమ్మెల్యే సమావేశం
- త్వరలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తాం
- ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం
- మెరుగైన వసతులు కల్పిస్తాం
- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సమావేశానికి హాజరైన ప్రభాత్‌నగర్ కాలనీవాసులు

చైతన్యపురి: గడ్డిఅన్నారం ఫ్రూట్ మార్కెట్ స్థలంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం వల్ల పరిసర కాలనీలలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావని... ఉత్పన్నం అయ్యే ఎలాంటి సమస్యనైనా పరిష్కరిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్ కాలనీవాసులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఫ్రూట్ మార్కెట్ తరలివెళ్లినా వాహనాలను ప్రభాత్‌నగర్ కాలనీ ప్రధాన రహదారులు, సర్వీస్ రోడ్ల వెంట నిలిపి వ్యాపారాలు చేసుకోవటం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, కళాశాలలకు వచ్చే విద్యార్థులు ముఖ్యంగా పరీక్షలప్పుడు సకాలంలో హాజరు కాలేని పరిస్థితి నెలకొందని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అలాగే డ్రైనేజీ సమస్య పరిష్కరించి తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వారు కోరారు. కాలనీలో ప్రభుత్వం నిర్మించిన మాధవరెడ్డి కమ్యూనిటీ హాల్ వల్ల పరిసర ప్రాంతాల్లోని ఇళ్లవారు అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేల మందితో వేడుకలు చేసుకోవటం, పార్కింగ్ సౌకర్యం లేకపోవటం, అర్ధరాత్రి వేళల్లో బాణసంచా కాల్చటం, అధిక శబ్దంతో మైక్ సౌండ్‌ల వల్ల నిద్రలేక వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు గురవుతున్నామన్నారు. ఫంక్షన్‌ల సమయంలో కుక్కలు చేరుకుని పాదచారులను గాయపరుస్తున్నాయన్నారు. కమ్యూనిటీ హాల్‌ను కమర్షియల్‌గా మార్చకుండా కాలనీవాసులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు మహిళలు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కాలనీ సంక్షేమ సంఘం సక్రమంగా లేనందున ప్రజలు సమస్యలు ఎవరికి చెప్పుకుని పరిష్కరించుకోవాలో అర్థంకాని అయోమయ స్థితిలో ఉన్నామన్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని పరిస్థితులు చక్కదిద్దాలని సీనియర్ సిటిజన్లు విజ్ఞప్తి చేశారు.

అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసుకోండి...

ప్రభాత్‌నగర్ కాలనీ సమస్యలపై త్వరలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కాలనీవాసులకు హామీ ఇచ్చారు. నూతన కమిటీ ఏర్పాటు కోసం కాలనీలోని సీనియర్ సిటిజన్లతో అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని వారికి సూచించారు. ప్రభుత్వం నిర్మించిన కమ్యూనిటీ హాల్స్ కాలనీవాసులకు ఉపయోగపడేలా ఉండాలి కానీ కమర్షియల్‌గా మార్చవద్దన్నారు. అలాచేస్తేనే కమ్యూనిటీ హాల్ పరిసర గృహాల వారు ఎదుర్కొంటున్న సమస్యలు తగ్గుతాయన్నారు. కమ్యూనిటీ హాళ్లను ప్రభుత్వమే నిర్వహించేలా ఇటీవలే ఓ ఆర్డినెన్స్ కూడా వచ్చిందని గుర్తు చేశారు. కాలనీవాసులంతా ఐక్యంగా నూతన కమిటీని ఎన్నుకొని సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కాలనీవాసులకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో సీనియర్ సిటిజన్లు బి.బాల్‌రెడ్డి, శ్రీమన్నారాయణ, ప్రసాద్, వెంకట్ రెడ్డి, బాలరాజు, బుద్ధదేవ్, కృష్ణమూర్తి, సమావేశ నిర్వాహకులు పల్లారెడ్డి రమణారెడ్డి, గట్టు శ్రీనివాస్, జయశ్రీ, సుధాకర్, వంశీ, భాస్కర్, విజయ్ పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

భారీగా ఆస్తి పన్ను వసూలు

- ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్లలో టార్గెట్ రూ. 173 కోట్లు
- వసూలైంది రూ. 172 కోట్లు
- వసూళ్లలో టాప్‌గా నిలిచిన ఎల్‌బీనగర్ సర్కిల్–4
- లక్ష్యాన్ని చేరుకోలేకపోయిన సర్కిల్–3



ఎల్‌బీనగర్: ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను చెల్లింపు గడువు శుక్రవారంతో ముగిసింది. ఇచ్చిన టార్గెట్‌ల కోసం అధికారులు, సిబ్బంది విశ్వ ప్రయత్నం చేసినా ఈ సంవత్సరం మూడు సర్కిళ్ల పరిధిలో రెండు సర్కిళ్లు తమ టార్గెట్‌ను చేరుకోలేకపోయాయి. ఈ సంవత్సరం ట్రేడ్ లైసెన్స్, ఆస్తి పన్నుల వసూళ్లల్లో ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోనే ఎల్‌బీనగర్ సర్కిల్–4 టాప్‌గా నిలిచింది. మూడు సర్కిళ్ల పరిధిలో ఈ సంవత్సనం టార్గెట్ రూ. 173 కోట్లు వసూళ్లే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు మూడు సర్కిళ్ల పరిధిలో సుమారుగా రూ. 172 కోట్ల మేరకు ఆస్తి పన్నులు వసూలైంది. మరో రూ. కోటి మేరకు ఆస్తి పన్ను వసూళ్లలో వెనుకబడ్డారని తెలుస్తోంది. ఆస్తి పన్ను చెల్లింపు గడువు శుక్రవారం అర్ధరాత్రి వరకు ఉండటంతో మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. టార్గెట్‌లను చేరుకుంటారో లేదో తెలియని పరిస్థితి ఉంది. శనివారం ఉదయం కల్లా ఆస్తి పన్ను వివరాలు పక్కా లెక్కలు తెలుస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

సర్కిళ్ల వారీగా వసూళ్లు ఇలా...

ఎల్‌బీనగర్ సర్కిల్–3లో మొత్తం టార్గెట్ రూ. 62 కోట్లు వసూలు లక్ష్యం కాగా ఇందులో సుమారు రూ. 60 కోట్లు వసూలు అయింది. ఇచ్చిన టార్గెట్ పూర్తి కావాలంటే మరో రూ. 2 కోట్లు వసూలు కావాల్సి ఉంది. సర్కిల్–4లో ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం రూ. 49 కోట్లు కాగా వసూలైంది రూ. 50 కోట్లు. అంటే ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయడమే కాకుండా అదనంగా మరో రూ. కోటి చేరింది. సర్కిల్–5లో రూ. 62 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. శుక్రవారం సుమారు రూ. 62 కోట్లు వసూలు చేశారు.

సమస్యలను పరిష్కరించాలని జెడ్‌సీకి వినతి



జెడ్‌సీ పంకజకు వినతిపత్రమిస్తున్న కార్పొరేటర్ అరుణ

నాగోలు: డివిజన్ పరిధిలోని పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ పంకజను కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరామన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

చాదర్‌ఘాట్: విద్యార్థులను సాంస్కృతిక కార్యక్రమల్లోనూ ప్రోత్సహించాలని కాంగ్రెస్ పార్టీ ఓల్డ్‌మలక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా వివిధ పాఠశాలల్లో భరతనాట్యం, కూచిపూడి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం ఆయన బహుమతులు అందజేశారు. ఓల్డ్‌మలక్‌పేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బాబు సుదర్శన్, చౌకి రవికుమార్, బాబు శ్రీనివాస్, చేపూరి రాజారావు, శ్రీనివాస్ గుప్తా, అశోక్, రమేష్ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

‘పది’ పరీక్షలకు సర్వం సిద్ధం



హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న ప్రశ్న పత్రాల పెట్టెలు

హయత్‌నగర్: పదవ తరగతి పరీక్షలకు అంతా సిద్ధం చేశామని హయత్‌నగర్ ఎంఈఓ హీర్యానాయక్ తెలిపారు. సోమవారం నుంచి జరిగే పరీక్షలకు హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్టు మండలాల్లోని మొత్తం 28 పరీక్షా కేంద్రాలలో మొత్తం 6519 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఆయన తెలిపారు. వీరిలో బీసీ, మైనార్టీ పాఠశాలలకు చెందిన 453 మంది ఉండగా ప్రైవేటు పాఠశాలలకు చెందిన వారు 48866 ఉన్నారని, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 1233 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని ఆయన వివరించారు. ఒక్కో కేంద్రంలో సుమారు 230 మంది పరీక్షలు రాస్తారని సుమారు 400 మంది ఉపాధ్యాయులు (ఇన్విజిలేటర్లు) పని చేస్తారని ఆయన అన్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్ల సదపాయం, ఫ్యాన్లు, బెంచీలు, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లను అందుబాటులో ఉంచామన్నారు. ఉదయం 9:30 గంటలకు పరీక్షలు ప్రారంభం అవుతాయని, విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఇప్పటికే హాల్‌టికెట్లు పాఠశాలలకు పంపించామని, హాల్ టికెట్లు అందని వారు వెబ్‌సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రశ్న పత్రాలు ఉన్న బాక్సులు శుక్రవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. వాటిని భద్రపరిచి పరీక్షల రోజున ఆయా పరీక్షా కేంద్రాలకు తరలిస్తారని అధికారులు తెలిపారు.

టెన్త్ విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలి

నాగోలు: పదవ తరగతి విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాయాలని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం నాగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు, ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. అనంతరం అరుణ మాట్లాడుతూ... విద్యార్థులకు ప్రణాళిక ప్రకారం చదువుకొని పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. లక్ష్యాన్ని ఏర్పరుచుకోవానలి సూచించారు. పరీక్షలు మంచిగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

పద్మావతి కాలనీలో రిక్వెస్ట్ బస్ స్టాప్ ప్రారంభం

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని పద్మావతి కాలనీలో రిక్వెస్ట్ బస్ స్టాప్‌ను గురువారం ప్రారంభించారు. హయత్‌నగర్ ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ రఘుతో కలిసి మాజీ కార్పొరేటర్ తిమల్‌రెడ్డి బస్‌స్టాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భద్రత, సురక్షితమైన ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అంజిరెడ్డి, చక్రవర్తి, రిజు, గోపాల్, శ్రీనివాసరావు, ఆంజనేయులు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారులపై బైక్ రేసింగ్‌లు

- స్పీడ్‌గా వెళ్తున్న రేసర్స్ బైకులతో ప్రజలు బెంబేలు
- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న యువకులు

దిల్‌సుఖ్‌నగర్: రోడ్లపై బైకు రేసింగ్‌పై నిషేధం ఉన్నా యువకులు మాత్రం రేసింగ్‌లను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. మలక్‌పేట్ జోన్ పరిధిలోని ప్రధాన రోడ్లపై యువకులు నిత్యం బైక్ రేసింగ్‌లను పాల్పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై కొందరు యువకులు బైకులపై బలాదూర్‌గా తిరుగుతూ బైక్ రేసింగ్‌లు నిర్వహిస్తున్నారు.

- కొన్ని రోజులుగా యువకులు దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట్ జాతీయ రహదారిపై ఉదయం, సాయంత్రం అనే తేడా లేకుండా రోడ్లపై బైక్ రేసింగ్‌లు నిర్వహిస్తున్నారు. వాహనాల మధ్య నుంచి స్పీడుగా వెళ్తున్న రేసర్‌ల బైకులను చూసి రోడ్డుపై వెళ్లే వాహనాదారులు ఆందోళన చెందుతున్నారు. స్పీడుగా వెళ్లే యువకులతో జాతీయ రహదారిపై వెళ్లే ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- నగరంలోని ప్రధాన రహదారులపై బైకు రేసింగ్‌లు ఇప్పుడు యువతలో ఒక ఫ్యాషన్‌గా మారిందనే చెప్పొచ్చు. ఆ సమయం ఎప్పుడు వస్తుందా అని బైకులు వేసుకుని రయ్‌మని దూసుకెళ్లడానికి సిద్ధంగా ఉంటున్నారు.
- ధనవంతుల బిడ్డలు వివిధ దేశాల నుంచి దిగుమతి చేసుకున్న అత్యధిక సీసీ సామర్థ్యం ఉన్న బైకులను నగర రోడ్లపై ట్రాఫిక్ మధ్యలో నడపలేని పరిస్థితి ఏర్పడటంతో యువత రాత్రి సమయాలలో ఆ బైకులతో ఒక చోటకు చేరుకుని పందాలు వేసుకుని రేసింగ్‌లకు పాల్పడుతున్నారు. బైక్ రేసర్లపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, భారీ బందోబస్తు ఏర్పాటు చేసి యువత రేసింగ్‌లకు పాల్పడకుండా తగిన విధంగా కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

కల్లు గీత సొసైటీలకు పరిహారం అందజేత



పరిహారాన్ని అందిస్తున్న ఎక్సైజ్ అధికారులు

హయత్‌నగర్: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తాటి చెట్లను కోల్పోతున్న కల్లు గీత సొసైటీలకు గురువారం హయత్‌నగర్ ఎక్సైజ్ అధికారులు నష్ట పరిహారాన్ని అందజేశారు. హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో సరూర్‌నగర్ ఎక్సైజ్ సూరింటెండెంట్ రవీందర్‌రావు ఇందుకు సంబంధించిన చెక్కులను నిర్వాహకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చింతల్‌కుంట చెక్‌పోస్ట్ నుంచి కొత్తగూడెం వరకు రోడ్డు విస్తరణలో భాగంగా మొత్తం 142 తాటి చెట్లను తొలగించామన్నారు. దీనికి పరిహారంగా పెద్దఅంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్టు, లష్కర్‌గూడ సొసైటీలకు కలిపి రూ. 1,39,728లను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో హయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌గౌడ్, కల్పన, ఎస్ఐలు సరళ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామ రంగారెడ్డి జన్మదిన వేడుకలు



ఆడియో సీడీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్: బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి జన్మదిన వేడుకలు గురువారం రాత్రి ఎల్‌బీనగర్ చంద్రపురి కాలనీలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. పార్టీ శ్రేణులు, కార్పొరేటర్లు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, నాయకులు హాజరై కేక్‌ను కట్ చేసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చెక్క అశోక్‌కుమార్ రూపొందించిన పాటల ఆడియో సీడీని ఆవిష్కరించారు.

‘ప్రతి వర్షపు చుక్కనూ భూమిలోకి పంపాలి’



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జలమండలి జీఎం వినోద్ తదితరులు

వనస్థలిపురం: ప్రతి వర్షపు చుక్కనూ ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి వెళ్లేలా చేస్తే భూగర్భ జలాలు వృద్ధి చెంది నీటి కొరతను అధిగమించొచ్చని జలమండలి వనస్థలిపురం జీఎం వినోద్ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని చైతన్య పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడ్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ నాగబ్రహ్మాచారి మాట్లాడుతూ... నేటి నీటి పొదుపు భవిష్యత్‌తరాలకు మంచి మలుపు అని అన్నారు. ఇంట్లో వాడే నీటి పొదుపు విషయంలో తగిన జాగ్రత్తలు వహించేలా పిల్లలు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులతో కాలనీలో ర్యాలీ నిర్వహించారు. జలమండలి మేనేజర్ సాయి శ్రీనివాస్, ఉపాధ్యాయులు గౌసియా, సృజన్, సిబ్బంది శ్రీనివాస్, శ్రీధర్, సాయి నరేష్ పాల్గొన్నారు.

చంచల్‌గూడలో...

చంచల్‌గూడ: అమూల్యమైన నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని విద్యార్థులు సూచిస్తున్నారు. ప్రపంచ నీటి దినోత్సవంగా సందర్భంగా శుక్రవారం చంచల్‌గూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వమించారు. భావితరాలకు నీటి ఎద్దడి లేకుండా ప్రజలు నీటిని పొదుపుగా సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు జయలక్ష్మీ, నిర్మల, సుజాత, రేష్మ, హృదయనేరి, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న చంచల్‌గూడ పాఠశాల విద్యార్థులు

పేదలకు అండగా ‘కల్యాణలక్ష్మి, షాదీముబారక్’

- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

బడంగ్‌పేట్: పేద కుటుంబంలోని ఆడపిల్లల వివాహాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అండగా ఉంటాయని మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సబితారెడ్డి హాజరై, స్థానిక కార్పొరేటర్లతో కలిసి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పేద, మధ్య తరగతి ప్రజల అవసరాలకు తగ్గట్టుగానే సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారని అన్నారు. బాల్య వివాహాలకు చెక్ పెడుతూ సీఎం కేసీఆర్ ఇంటికి పెద్దకొడుకులా మారారని కొనియాడారు. పేదల కోసం చేపడుతున్న అన్ని పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, తహసీల్దార్ జనార్దన్‌రావు, కమిషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు బోయపల్లి దీపిక, జెనిగె భారతమ్మ, దడిగ శంకర్, పవన్‌యాదవ్, సుర్జగంటి అర్జున్, ఏనుగు రాంరెడ్డి, లిక్కి మమత తదితరులు పాల్గొన్నారు.




లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

ఘనంగా రవీంద్రభారతి స్కూల్స్ స్నాతకోత్సవం



వనస్థలిపురం స్కూల్ కిడ్స్ కాన్వకేషన్‌లో పాల్గొన్న డాక్టర్ శ్రీలత, డీన్, ప్రిన్సిపాల్



హస్తినాపురం రవీంద్రభారతి స్కూల్ స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

హస్తినాపురం: చిట్టి పొట్టి చిన్నారుల ప్రతిభ అందరినీ అబ్బుర పరచాయని, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని రవీంద్రభారతి పాఠశాల సీఏవో శోభ అన్నారు. హస్తినాపురం జిల్లా పరిషత్ రోడ్డులోని రవీంద్రభారతి స్కూల్‌లో చిన్నారుల స్నాతకోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్కూల్ సీఏవో శోభ మాట్లాడుతూ... నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని వారిని సరైన మార్గంలో వెళ్లేలా తీర్చి దిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులపై ఉందన్నారు. బుడిబుడి అడుగుల చిన్నారులు ప్రసంగించడం , కథలు, శ్లోకాలు, పాటలుపాడటం వారియొక్క ప్రతిభ ఎల్లలు లేనిదిగా నిరూపిస్తున్నదని అన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు పతకాలు, ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల జోనల్ డీన్ జ్యోతి, ప్రధానోపాధ్యాయురాలు మంగళగౌరి, డీఐ క్రాంతికుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వనస్థలిపురంలో...

వనస్థలిపురం: వనస్థలిపురంలోని రవీంద్రభారతి పాఠశాలలో కిడ్స్ కాన్వకేషన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వనస్థలిపురం, హయత్‌నగర్ బ్రాంచీలకు చెందిన విద్యార్థులకు షీల్డ్‌లు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ... విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దాన్ని చేరుకునేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. పాఠశాల జోనల్ డీన్ ప్రియా మనీష్, ప్రిన్సిపాల్‌లు కిరణ్ అగర్వాల్, వినోదిని, డీఐ రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.